క్లుప్తంగా

మొక్కల పెంపకంపై అవగాహన



నెల్లూరు(సెంట్రల్): సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీవీనగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్కల పెంపకంపై గెలాక్సీ స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మొక్కల పెంపకం, ఏయే పంటలను ఎప్పుడు సాగు చేసుకోవాలి, వర్మికంపోస్ట్ తయారీ, తదితరాలను వివరించారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లలితా శివజ్యోతి, పాఠశాల ప్రిన్సిపల్ ప్రమీలారాణి పాల్గొన్నారు.

అకౌంట్స్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విజిత నగరంలోని విద్యుత్ భవన్‌లో బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. కర్నూలు జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సెక్రటరీ శివయ్య, అకౌంట్స్ విభాగాధికారులు సుహాసిని, సంజీవమూర్తి, అనిత, శాంతి, తదితరులు ఆమెకు శుభాకాంక్షలను తెలియజేశారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి



నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది తమ శేషజీవితాన్ని హాయిగా గడపాలని ఎస్పీ విజయారావు కాంక్షించారు. స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సుకుమ్‌బాషా మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో సన్మాన సభను ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమ్‌బాషా దంపతులను ఎస్పీ సత్కరించారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెన్యువల్ ప్రక్రియ

నెల్లూరు(బారకాసు): నెల్లూరు జర్నలిస్ట్స్ పరస్పర సహాయక సహకార గృహ నిర్మాణ సంఘానికి సంబంధించిన సభ్యుల సభ్యత్వాల రెన్యువల్ ప్రక్రియ మంగళవారంతో ముగిసిందని సొసైటీ కన్వీనర్ శేషాచలపతి, కో కన్వీనర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. సొసైటీకి సంబంధించిన ఎన్నికలను త్వరలో నిర్వహించనున్నామని చెప్పారు.

ఇందూ ధర్మ ప్రచారం



నెల్లూరు(బృందావనం): వనంతోపు, భక్తవత్సలనగర్, అనగుంట, తదితర ప్రాంతాల్లో ఇందూ ధర్మ ప్రచారాన్ని త్రైత సిద్ధాంతం ఇందూ జ్ఞాన వేదిక – ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నగర శాఖ అధ్యక్షుడు సురమౌళి, నిర్వాహకులు నరసింహ ప్రసాద్, సోమశేఖర్, రమణయ్య, సునీల్, లీలావతి, పద్మజ, సుమలత పాల్గొన్నారు.

లోన్ పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): లోన్ పేరిట మోసగించి నగదును కాజేసిన ఘటనలో నిందితుడైన విశ్రాంత ఇంజినీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని సమాచారం. వివరాలు.. నగరానికి చెందిన ఓ వ్యక్తికి మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డిప్యూటీ డైరెక్టర్ పేరిట ఒకరు ఫోన్ చేశారు. పీఎంఈజీపై ద్వారా రుణాన్ని ఇప్పిస్తానని.. దీనికి ప్రాసెసింగ్ ఫీజుగా నగదును చెల్లించాలని నమ్మించి రూ 2.66 లక్షలను కాజేశారు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ ఆధారంగా నిందితుడ్ని విశ్రాంత ఇంజనీర్‌గా గుర్తించి అతడ్ని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం.

రంగడి బ్రహ్మోత్సవాలకు

సర్వం సిద్ధం

- అంకురార్పణ రేపు
- భక్తుల కోసం దేవదాయ శాఖ విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు(బృందావనం): పవిత్ర పినాకినీ తీరాన కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభంకానున్నాయి. సింహపురి క్షేత్రపాలకుడిగా, భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భాసిల్లుతూ ఉత్తర శ్రీరంగంగా ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను నయనానందకరంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తమైంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయం, మాడవీధుల్లో స్వామి, దేవతామూర్తుల చిత్రాలు, తూర్పున ఉన్న రాజగోపురం, మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. అలంకార వాహనాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. అశేష భక్తజనం కోసం దేవదాయ శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది.



విద్యుద్దీపాలతో శోభిల్లుతున్న తూర్పు రాజగోపురం

ప్రతి నిత్యం.. విశేషం

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆరు గంటలకు అంకురార్పణ జరగనుంది.
- మూడో తేదీ ఉదయం ఐదు గంటలకు ధ్వజారోహణ, రాత్రి తొమ్మిది గంటలకు శేషవాహనసేవ.
- నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు సూర్యప్రభ, రాత్రి తొమ్మిదికి హంస వాహనసేవ.
- ఐదో తేదీ ఉదయం ఎనిమిదికి సింహ వాహనసేవ, రాత్రి తొమ్మిది గంటలకు చంద్రప్రభ వాహనసేవ.
- ఆరో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు పల్లకిసేవ, రాత్రి తొమ్మిదికి హనుమంతసేవ.
- ఏడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు మోహినీ అలంకారం, సాయంత్రం నాలుగుకు పూలంగిసేవ, రాత్రి పది గంటలకు బంగారు గరుడసేవ.
- ఎనిమిదో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పూలంగిసేవ, రాత్రి ఏడు గంటలకు కల్యాణోత్సవం, అర్ధరాత్రి ఒంటి గంటకు గజవాహనసేవ.
- తొమ్మిదో తేదీ ఉదయం 8.30కు రథోత్సవం, రాత్రి ఎనిమిదికి పొన్న వాహనసేవ.
- పదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు తిరుప్పాయ్‌న్నాడల్, రాత్రి ఏడుకు అశ్వవాహనసేవ.
- 11వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ముసుగులసేవ, చక్రస్నానం. సాయంత్రం ఆరు గంటలకు పుణ్యకోటి విమాన అలంకారం.
- 12వ తేదీ సాయంత్రం ఆరుకు పుష్పయాగం, తొమ్మిది గంటలకు దవనోత్సవం, రాత్రి 11కు ధ్వజావరోహణ.
- 13వ తేదీ రాత్రి ఏడు గంటలకు తెప్పోత్సవం.

ఘనంగా సైన్స్ దినోత్సవం



నారాయణ స్కూల్లో..



ఆర్కిడ్ పాఠశాలలో..

నెల్లూరు (టౌన్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నగరంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించి ప్రశంసలను అందుకున్నారు.

➡ కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పలు ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన ముగ్గురికి బహుమతులను అందజేశారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషారాణి, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని రామయ్య బడిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేదమూర్తి, ఉపాధ్యాయులు మధుమోహన్, విజయలక్ష్మి, కవిత, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

➡ వెంగళరావునగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రాజు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, వెంకటేశ్వర్లు, సైన్స్ ఉపాధ్యాయులు భూషణ్‌కుమార్, వెంకట్, శ్రీనివాస్, శివ, తదితరులు పాల్గొన్నారు.

➡ రామలింగాపురంలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో ఎడ్యు ఫెస్ట్‌ను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను సీనియర్ శాస్త్రవేత్త లక్ష్మి పరిశీలించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, ఏజీఎం రమణారెడ్డి, డీన్ నరేంద్ర, ప్రిన్సిపల్స్ వెంగళరావు, సోనీ, అకడమిక్ డీన్స్ బిందు, రాఘవేంద్ర, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రంజిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని ఆర్కిడ్ స్కూల్లో పలు ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, రామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామరాజు, ఏఎమ్వీఐ పూర్ణచంద్రరావు, కరస్పాండెంట్ శశిధర్, ప్రిన్సిపల్ అతహర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని గ్రామికనగర్‌లో గల ఎస్వీఎస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైన్స్ ఎక్స్‌పోను నిర్వహించారు. ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, ఎంఈఓ తిరుపాల్, విశ్రాంత ఎంఈఓ నరసయ్య, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, ప్రిన్సిపల్ ప్రమీల, ఇన్‌చార్జి గౌరి, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, తదితరులు పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు రోడ్డులోని పార్థసారథినగర్‌లో గల సిల్వర్ ఓక్స్ స్కూల్లో అకడమిక్ ఎక్స్‌పోను నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖాచారి, వెంకటాద్రి, ప్రిన్సిపల్ సుఖదాదాస్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీఎస్ స్కూల్లో..



సిల్వర్ ఓక్స్‌లో..

సర్టిఫికెట్ల అందజేత


నెల్లూరు రూరల్: జ్యోతినగర్‌లోని వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. నెహ్రూ యువ కేంద్ర అధికారి మహేంద్రరెడ్డి, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు వసుంధర, జర్నలిస్ట్ యూనియన్ నేత జయప్రకాష్, శేఖర్, మస్తాన్, నారాయణ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.




విద్యా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని ప్రతిభ గల బ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, విద్యా సహాయకాలను తిప్పరాజు వెంకటసుబ్బయ్య చౌల్ట్రీ ఆధ్వర్యంలో అందజేయనున్నామని మేనేజింగ్ ట్రస్టీ ఫణిరత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన బ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తుకు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జతచేసి గాంధీబొమ్మ సమీపంలోని తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రం కార్యాలయంలో ఈ నెల ఏడులోపు అందజేయాలని కోరారు.

టైలర్లకు సత్కారం



రెడ్‌క్రాస్ కార్యాలయంలో..



వెంకటేశ్వరపురంలో..

నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయంలో దర్జీల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలోని మహిళా టైలర్లు పావని, వసుంధరను సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో చేరి నైపుణ్యం పొందాలని కోరారు. వివరాలకు 96471 08108, 93908 85240 నంబర్లను సంప్రదించాలని సూచించారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, స్టాటిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ గుర్నాథరావు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో గల జనార్దన్‌రెడ్డికాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో పలువురు టైలర్లను సత్కరించారు. పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ సభ్యుడు అల్లాబక్షు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీరా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు అన్సర్, జమీర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సఫాయిమిత్రలు జాగ్రత్తలు పాటించాలి

నెల్లూరు సిటీ: కార్పొరేషన్ అందజేసిన యూనిఫారాలు, గ్లౌజ్‌లు, హెల్మెట్, షూస్‌ను సఫాయిమిత్ర కార్మికులు తప్పక వినియోగించి.. విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కేంద్ర సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయం నుంచి కమిషనర్ మాట్లాడారు. విధి నిర్వహణలో కార్మికుల ప్రాణరక్షణతో పాటు వారి కుటుంబాల జీవన భద్రత కోసం అమలు చేస్తున్న ప్రణాళికలను వివరించారు. మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసేందుకు అత్యాధునిక పరికరాలను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కమిషనర్, తదితరులు

టైలర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం): టైలర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. టైలర్స్ డేను పురస్కరించుకొని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో జిల్లా టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో టైలర్ల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలో టైలర్ల భవనానికి సంబంధించిన స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, యానాదయ్య, ఉపాధ్యక్షుడు మదార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైమ్): మైనర్ల డ్రైవింగ్‌పై ట్రాఫిక్ అధికారులు స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, సౌత్ ఆర్ఐ రమణారెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్, ఆర్ఎస్సైలు చంద్రమౌళి, తిరుమలరెడ్డి, నాగరాజు తమ సిబ్బందితో కలిసి డ్రైవ్‌ను చేపట్టారు. డ్రైవింగ్ చేస్తున్న పలువురు మైనర్లను అదుపులోకి తీసుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిచి వారి సమక్షంలో కౌన్సెలింగ్ చేశారు. వాహనంతో మరోసారి మైనర్లు పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన పలు వాహనదారులకు జరిమానాలను విధించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న చంద్రమౌళి

జనావాసాలకు దూరంగా పందుల తరలింపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో గల వెంకటేశ్వరపురం, పోస్టాఫీస్ వీధి, నల్లకాలువ, జనార్దన్‌రెడ్డి కాలనీ, గాంధీగిరిజన కాలనీ, ఇస్లాంపేట, తదితర ప్రాంతాల్లో పందులను జనావాసాలకు దూరంగా తరలించారు. దాదాపు వందకుపైగా పందులను పెంపకందారులు పట్టుకొని ప్రత్యేక వాహనాల్లో దూర ప్రాంతాలకు తరలించారు.



మద్యం అనధికార విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): మద్యం అనధికార విక్రయాలపై చిన్నబజార్ పోలీసులు దాడి చేసి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. అతని నుంచి 42 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు తన కార్యాలయంలో మంగళవారం వెల్లడించారు. ఇరుగాళమ్మ సంఘం ప్రాంతానికి చెందిన వెంకటరమణ స్థానికంగా బడ్డీ కొట్టును నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సై లతీపున్నీసా తన సిబ్బందితో కలిసి బడ్డీ కొట్టుపై దాడి చేశారు. 42 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితుడ్ని అరెస్ట్ చేశారు. నిందితుడు ఏయే దుకాణాల్లో మద్యాన్ని కొనుగోలు చేశారనే వివరాలను సేకరిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మద్యం అనధికార విక్రయాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తిస్తే డయల్ 112 లేదా స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.



వివరాలను వెల్లడిస్తున్న సురేంద్రబాబు

గ్రామీణ వ్యవసాయ పనులపై అవగాహన



నెల్లూరు రూరల్: గ్రామీణ వ్యవసాయ పనులపై వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సౌత్‌మోపూరులో కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గ్రామ స్వరూప చిత్రపటాన్ని నేలపై రూపొందించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న వనరులను గుర్తించారు. కేంద్ర సమన్వయకర్త శివజ్యోతి, శాస్త్రవేత్త లోకేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.